


# తండ్రులూ కొడుకులూ

మంథా వెంకట రమణారావు

ఆ రోజు సాయంత్రం నేను, నా ఇంటి ముందున్న లాన్ మీద ఒత్తుగా నీళ్లు జల్లించి, గార్డెన్‌లో కుర్చీ వేసుకుని, చల్లని పానీయం చప్పరిస్తూ సేద దేరు తున్నాను. చీకటి పడుతోంది. వాతావరణం ప్రశాంతంగా వుంది. నా మనస్సెంతో హాయిగా వుంది.

అకస్మాత్తుగా ఈ ప్రశాంత వాతావరణాన్ని భంగ పరుస్తూ కేకలు వినిపించేయి. ఒక ముసలాడ్ని ఒక యువకుడు కర్ర పట్టుకొని వెంటాడుతున్నాడు. ముసలాడు యువకుడ్ని తిడుతున్నాడు.

నేను సావకాశంగా కుర్చీలో కూర్చోవడం చూసి, ముసలాడు నా దగ్గరికి పరుగున వచ్చేడు. వచ్చి ఆవేశంగా అన్నాడు – "సూడండి బాబూ! గుంట నంజకొడుకు! ఈడమ్మ! నన్నే తండానికి యెంట బడ్డాడు! నన్ను సంపుతాడంట!'

"ఎందుకు చంపుతాట్ట? వాడెవడు? నీ ఆగర్భ శత్రువా? ఏరా గుంటడా? ఈ ముస లాడ్ని ఎందుకు చంపుతానంటున్నావు? వాడు నీకేం ద్రోహం చేసేడు?" అంటూ ఆ కుర్రాడ్ని ఆపేను.

కాని యువకుడు విదిలించుకుందామని చూసేడు. మరో మనిషి కూడా వచ్చి నాకు సాయం చేసేడు. ఆ యువకుడు ముసలాడ్ని తిడుతూ, చేతిలోనున్న రెండు మూరల బడితిని ఝళిపిస్తున్నాడు!

"ఆడు నా కొడుకు బాబూ! నా పెళ్లంకీ నాకూ స్వయాన పుట్టిన కొడుకు" ముసలాడన్నాడు.

"నీ కొడుకే నిన్ను చంపుతానంటున్నాడా? ఏంరా? నీకేమన్నా మతిపోయిందా? నీ అయ్యనే చంపుతానంటావేమిటి?"

"ఒగ్గండి బాబూ! ఆడి రగతం కల్లసూత్తాని యాల!"

"సూసినారా బాబూ? యేలెడు నేడు. నన్ను సంపుతాట్ట!" అంటూ తండ్రి.

కాని కొడుకుని గట్టిగా పట్టుకున్నాం. వాడికి ఇరవై ఏళ్లుంటాయి. బలంగా వున్నాడు. కళ్లల్లోకి పడుతూ ఒత్తయిన జుత్తు.

తండ్రి మాలీ పని చేస్తున్నాడు. ఇంటికి ఇరవై చొప్పున వుచ్చుకొని, ఆ ఇళ్ల పూదోటల్ని చూసుకుం టాడు. కొడుకూ మాలీ పనే చేసేవాడు కాని ఆ మధ్యన ఫ్యాక్టరీలో టెంపరరీ ఖలాసీగా ఉద్యోగం దొరికింది. మాలీ పని మానేసేడు. సంవత్సరం తరవాత ఫ్యాక్టరీలో పని పోయింది. వాడు మరి మాలీ పని చెయ్యడం నామోషీఅనిపించి ఊరికే కూచున్నాడు. ఫ్యాక్టరీలో పని వున్నంత కాలం, జల్సాలకి డబ్బంతా ఖర్చుచేసేడు. ఉద్యోగం పోయేక నాన్నే గతయేడు. వాడికి పెళ్లయింది. కాని ఆమెని దేశంలోనే వదిలి ఒరిస్సా వచ్చేసేడు. తప్ప చెల్లించేసి మరొకర్తిని చేపడదామని చూస్తున్నాడు. తల్లి ఏనాడో పోయింది. తండ్రీకొడుకులిద్దరూ ఒక దొరగారి బంగళాకున్న సర్వెంట్స్ క్వార్టర్‌లో వుంటున్నారు.

పని పోయిందగ్గర్నించీ కొడుకు చేతిలో డబ్బు లాడడం లేదు. రోజూ తండ్రితో కొడుక్కి తగవు. "ఏదో ఒక పని సెయ్యి. యెన్నాళ్లిలా తిని కూకుం టావు?" అని తండ్రంటే, "కలాసీ పని దొరుకుతే సేత్తాను, నేకపోతే ఇట్టనే వుంటాను" అన్నాడు.

కొడుకొక మాలీ కూతుర్ని ప్రేమించేడు. దాన్తో చక్కర్లు కొడుతున్నాడు. తండ్రి వద్దన్నాడు. కోడల్ని దేశం నించి తెచ్చుకుంటే ఇద్దరికీ ఇంత వండిపడే స్తుంది. ఎవరింటన్నా పాచి పనులు చేసి డబ్బు సంపాదిస్తుంది. ఆ మాటంటే కొడుకు ససేమిరా అన్నాడు. రోజూ వాదోపవాదాలతో పాటు తండ్రీ కొడుకుల మధ్య వైషమ్యం పెరిగింది. వారి మధ్య రగిలే ద్వేషాగ్నిని చల్లార్చేందుకు అటుముసలాడి భార్యా లేదు, ఇటు కోడలూ లేదు. ఆడదంటూ ఇంట్లో వుంటే కెటాలిస్ట్‌గా ఉపకరించును.

మనిషిలో అనాదిగా తండ్రీకొడుకుల మధ్య నుండే అంతరం ద్వేషంగా మారింది.

ఇవాళ ఇద్దరి మధ్యా మంటలు భగ్గుమన్నాయి. ఇద్దరిలోనూ ఒకరు నశిస్తేనే తప్ప ద్వేషం చల్లా రని పరిస్థితి ఏర్పడింది. "దమ్మిడీ ఆర్జన్లేదు! తిని కూకోని, ఆడ గుంటలెంట పడి, పోకిరీ యేసాలె య్యడం! మొగోడివి కావా? మాలీ పని సెయ్య కూడదా? సిగ్గులేని సన్నాసి!' అన్నాడు తండ్రి.

అసలే అందరూ అనే సూటీపోటీ మాటలతో అవమానం పొంది వున్న కొడుకు యువ రక్తం మరిగింది. స్కూలు వాసన, కాలేజీ వాసనా లేని పచ్చి ఆవేశాల మనసులు వారివి. మనసులో ఒకటి, పైకొకటి ఆలోచనలు వారికుండవు. చేతి కందిన దుడ్డుకర్రనందుకొని తండ్రి వెంట పడ్డాడు కొడుకు!

కొడుకుని పట్టుకొని ఆపి, తక్కిన మాలీలకి అప్పగించేసరికి నా తల ప్రాణం తోకకి వచ్చింది.

కొడుకు అరిచాడు. "అడ్ని నానేటన్నాను బాబూ! ముసలి నాకొడుకు సాయంత్రమయే సరికి పూటుగా తాగేసొచ్చి నానా మాటలూ అంటే యిన్నాల్లూ పల్లకున్నాను. మీరే నాయం సెప్పండి! ఈడే నా యమ్మని సంపినాడు! రోజూ తాగొచ్చి నా యమ్మని తన్నడమే. ఈడి బాధలు పడనేకే నా యమ్మ సచ్చింది. నాకు గేనం రాకండ పెల్లిసేసినారు. ఎదిగినాక మదపిచ్చి పట్టుకుంది దానికి. ఊరల్లా దానికి మొగుల్లే. ఆ నీతిలే నిదాయిని యేలుకోమంటాడు! అన్నింటికీ ఈడి జులుమే! ఈడి మాటే ఆయిపోవాల! ఏడాది కలాసిగా పనిజేసినాను. నాను యాభై వుంచు కొని ఈడికి తక్కిండబ్బిస్తే, తప్పతాగి డబ్బంతా తగలేసేవోడు. ఆ డబ్బుంటే కిల్లీబడ్డీ యెట్టుకొ

నుందును! ఊయాల పూటుగా యేసుకొచ్చి నా యమ్మని తిట్టటం ఆరంబించినాడు. అమ్మా, ఆలీ యెట్టి! నానింక ఊరుకోను! నన్నొగ్గండి. ఆడ్ని సంపుతాను! ఉరి తీస్తే తీసినారు!"

షచ్చి ఆవేశం బట్టలిప్పకొని విజృంభిస్తూ నాట్యం చేసింది కొడుకు మనసులో. వాడిని ఎంతో కష్టం మీద శాంతపరిచి పంపేం.

***

మర్నాడు ఆఫీసుకి వెళ్ళినప్పుడు నా కొలీగ్‌కి నిన్నటి సంఘటన గురించి వివరించేను.

నేనాశించినట్టు అతడు ఆశ్చర్యపోలేదు. "వాళ్ల వరకూ ఎందుకు? వాళ్లకి చదువూ, సంస్కారమూ, మర్యాదా మప్పితం ఒంటపట్టలేదు. కల్చర్ వున్న మనలోనే అలా జరుగుతున్నది" అన్నాడు.

నేను నమ్మలేకపోయేను. "ఎవరి సంగతి మాట్లాడుతున్నావు?" అనడిగేను.

"ఏం? తెలీదా? మనతో ఒకప్పుడు పనిచేసే రమణయ్య సంగతే. తెలీదా?"

"తెలీదు. ఏమా కథ?" అనడిగేను.

"రమణయ్యకీ అతడి తండ్రికీ బద్ధ వైరం! తండ్రి మాటెత్తితేనే బూతులు తిట్టేవాడు. మీ మాలీ కొడుకూ అచ్చతెలుగులో తిట్టుకుంటే రమణయ్య ఆంగ్లంలో అదే అర్థం వచ్చే పదాలు వాడి తిట్టేవాడు. కొత్తా పాతా లేదు. ఎవరు వెళ్లి అతడి తండ్రి గురించడిగినా తండ్రిని నానా బూతులూ తిట్టేవాడు. అతడి తండ్రి ఈ ఊరు వస్తే, కొడుకింటికి వెళ్లేవాడు కాదు. కొడుకు స్నేహితుల ఇళ్లకి వెళ్లి వుండేవాడు. ఈ కొడుకు వెళ్లి తండ్రిని రమ్మని పిలవడు! తండ్రికి ఒక్కడే కొడుకు! రమణయ్య తల్లి పోయి పదేళ్లయింది. ఇద్దరూ ముఖాముఖీ ఎదురైతే తిట్టుకొనేవారు. కొడుకు మీద చాడీలు చెప్తూ తండ్రి ఇంటింటికీ తిరిగితే, తండ్రి సంగతి వస్తే తిడుతూ వుండేవాడు కొడుకు!"

"ఎందుకలా అయింది? రమణయ్య చాలా సామ్యుడే?"

"అదే అందరికీ ఆశ్చర్యం!"

అసలు సంగతి కూపీ లాగేను. రమణయ్యకి తల్లంటే చాలా ఆత్మీయత. తండ్రేమో తల్లిని నానా బాధలూ పెట్టేవాడట! భార్యంటే పడేది కాదట! ఆమె నోరూ వాపీ లేనిదట! మొగుడెన్ని బాధలు పెట్టినా నోరెత్తకుండా పడుండేది. తండ్రికి చెడు అలవాట్లేమీ లేవుట. కాని భార్యంటేనే ఎందుకో ద్వేషం! తిట్టేవాడు, కొట్టేవాడు. ఇంట్లోంచి గెంటేసేవాడు వీధిలోకి. పుట్టింటికి పొమ్మనేవాడు.

మన దేశంలో భర్త భార్యని పెట్టలేని బాధలేమున్నాయి కనక? కొట్టినా, తిట్టినా, చంపినా, వాడి పెళ్లాన్ని వాడు చంపుకుంటున్నాడు మనకేమి, అంటుంది లోకం!

తల్లిని తండ్రి పెట్టే బాధలని ప్రతిదినం ఆ చిన్న వయసులో చూసి, ఏమీ చెయ్యలేక బాధపడేవాడు రమణయ్య. రమణయ్య మనసులో తండ్రి మీద ద్వేషం పెరిగింది. తల్లి మీద జాలి, ప్రేమ. ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితి!

రమణయ్యకి ఉద్యోగం దొరికేక, తల్లిని తీసుకొని వచ్చేసేడు. తండ్రిని ఇంట అడుగుపెట్టనివ్వలేదు. కాని ఆమె ఊరుకుందా? ఉత్తమ భారతనారిలా, పతివ్రతలా, వా మొగుడు చంపినా సరే అతడి దగ్గరే వుంటానని చెప్పి వెళ్లిపోయింది మొగుడి దగ్గరకి. వెళ్లేక కొడుకు మీది కోపం కూడా ఆమె మీదే చూపేవాడు రమణయ్య తండ్రి. ఆఖరికెలాగయితేనేం ఆమె హరీమంది!

### కుక్కకంటే...

ఇద్దరు మిత్రులు తమ పెంపుడు కుక్కల గురించి ఇలా మాట్లాడు కొంటున్నారు.

"ఆశ్చర్యంగా వుందే! మీ కుక్కకి ఇన్ని విషయాలు ఎలా నేర్పుతున్నావు?" అనడిగాడు మొదటివాడు.

"పెద్ద కష్టమేమీ కాదు. నువ్వూ నేర్పవచ్చు. కానీ నీకు మీ కుక్కకంటే కొంచెం ఎక్కువగా తెలివి వుండాలి" అన్నాడు రెండవవాడు.

–కె.వి.ఆర్. అక్కయ్య



## హోప్ వారి థర్మో వేర్ గృహోపకరణాలు

అంతర్జాతీయ శ్రేణిలో కీర్తినార్జించిన సేలం స్టెయిన్‌లెస్ స్టీల్‌వారి సహకారంతో భారతదేశంలో ప్రప్రథమంగా ముందుతరాల వారికి ఉపయోగకరమైన గృహోపకరణాలను స్టెయిన్‌లెస్ స్టీల్ థర్మో వేర్‌తో హోప్ (ఇండియా) మద్రాస్ వారు అందిస్తున్నారు.

సింథటిక్, ప్లాస్టిక్ మెటీరియల్స్‌తో కాకుండా ఇప్పుడు శాశ్వతంగా నిలిచేలా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారైన గృహోపకరణములతో ఆహార పదార్థాలను, పానీయాలను నిల్వచేసుకోవచ్చు. హోప్ థర్మో వేర్ వారి గృహోపకరణములు వేడి పదార్థాలు వేడిగాను, చల్లని పదార్థాలు చల్లగాను యథాస్థితిలో నిల్వ వుంచడమేకాకుండా సహజమైన రుచి, వాసన ఎన్నో గంటల తర్వాత ఆదే అనుభూతిని కూడా కలిగిస్తూ వుంటాయి. హోప్ (ఇండియా) థర్మోవేర్ వారి ఉత్పత్తులను కోస్టల్ ఆంధ్రాకు మార్కెట్ చేయువారు: శ్రీ రాఘవేంద్ర మార్కెటింగ్ ఏజెన్సీస్, గుంటూరు.

అదీ సంగతి. నెలకు రెండు వేలు తెచ్చుకుంటున్న రమణయ్య కూడా చదువులేని మాలీ కొడుకులానే ప్రవర్తించేవాడుట. మరి మాలీ కొడుకునని లాభం ఏమిటి?

"మరో సంగతి కూడా విను. ఆ మధ్య మన కొలీగ్ వెంకట్రావు కొడుక్కి క్షమాపణ చెప్పుకున్నాడు తెలుసా?"

"వెంకట్రావు కొడుక్కి క్షమాపణ చెప్పుకోవడమా? ఇదేదో కొత్త సంగతే!"

"గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకెక్కవలసిన సంగతేనయ్యా! విను."

"చెప్పు, చెప్పు!"

"వెంకట్రావు కొడుకు సైన్స్ కాలేజీలో బి.ఎస్సీ. మొదటి సంవత్సరం చదువుతూ వుండేవాడు. వాడు హిప్పీలా జుత్తు పెంచేడు. కౌబాయ్ జీన్స్ వేసుకొనేవాడు. ఫ్రెండ్స్‌తో కలిసి రాత్రి పన్నెండు వరకూ సైకిళ్ల మీద రోడ్ల మీద చక్కర్లుకొట్టేవాడు. సినిమా హాళ్ళ దగ్గర 'ఈవ్ టీజింగ్' చేసేవాడు. ఈ వైనం చూసిన తండ్రి కొడుకుని గట్టిగా మందలించేడుట. సరిగా చదవకపోతే చదువు మాన్పించేస్తానని బెదిరించేడుట కొడుకుని. వెంకట్రావు సంగతి తెలుసును కదా? కోపమొచ్చిందంటే చెడామడా తిడతాడు. ఆ మాటలు సహించలేక ఆ సుపుత్రుడు వెళ్లి తన గ్యాంగ్‌తో తండ్రి తనకు చేసిన ఈ అవమానాన్ని వివరించేడుట! ఇంకేముంది? మర్నాడు పాతిక ముప్ఫయిమంది స్టూడెంట్స్ వచ్చి వెంకట్రావింటి మీద పడ్డారు. కొడుకే వాళ్లకి నాయకుడు! 'వెంకట్రావ్‌ని ఘెరావ్ చేసేరు."

"ఎందుకుట?"

"వాళ్లేమన్నారంటే, 'నువ్వొక స్టూడెంట్‌వి అవమానపరిచేవ్! తిట్టేవ్! వాడు నీకు కొడుకే అవొచ్చుగాక! అది వేరే సంగతి! కాని అది మా విద్యార్థి లోకానికే తీరని అవమానం! నీ కొడుకయిన స్టూడెంట్‌ని నువ్వు పల్లెత్తు మాటనడానికి వీల్లేదు. నీకా హక్కు లేదు. వాడిష్టమొచ్చినట్టు వాడు తిరుగుతాడు! నీ పనేమిటంటే, వాడడిగిన డబ్బు వాడికిచ్చి, వచ్చినట్టు పడుండమే! వాడిని చదువు మాన్పిస్తానని బెదిరించేవుట? ఆ పప్పలేం ఉడకవు! నువ్వు వాడిని సరిగా చూడాలి. వాడు చెప్పినట్టు వినాలి. వాడు చదువింక చాలు అన్నంత వరకూ చదివించాలి. ఆ మాటివ్వాలి. అంతేకాదు, నిన్న వాడి పట్ల అసభ్యంగా ప్రవర్తించినందుకు విచారం వ్యక్తపరిచి, ఒక స్టూడెంట్‌ని అవమానించినందుకు, విద్యార్థిలోకానికి చెందిన మా అందరికీ అపాలజీ ఇచ్చుకుంటేనే కాని నిన్ను కదలనివ్వం! నిన్ను నీ ఆఫీసుకి వెళ్ళనివ్వం. నిన్ను తిండి తిననివ్వం. ఊపిరి పీల్చుకోనివ్వం!' అంటూ డిమాండ్స్ పెట్టేరు! ఇలా రెండు గంటలసేపు దిగ్బంధనా, వాయుబంధనా జరిగేసరికి వెంకట్రావుకి శోషవచ్చి, చేసేది లేక కొడుక్కీ, వారందరికీ క్షమాపణలు చెప్పుకుని, వాళ్లు పెట్టిన డిమాండ్సన్నీ స్వీకరించి, చెయ్యమన్న వాగ్దానాలన్నీ చేసేడు! ఇదయ్యా బాబూ సంగతి. మాలీ కొడుకు నయమే! వాడికి ద్వేషం కలగడానికి కారణం వుంది. రమణయ్యకీ రీజనుంది. కాని వెంకట్రావు కొడుకు? 'బాగుపడరా బాబూ' అంటే తండ్రిని శిక్షించేడు!"

కాలమెలా మారిపోయిందీ అని ఆశ్చర్యపోయేను!

ఒకనాడు ఇంటికొచ్చేసరికి నా భార్యామణి చిరునవ్వుతో ఎదురొచ్చి, అతి ప్రేమగా నన్ను లోనికి తోడ్కొని వెళ్లి, స్పెషల్‌గా ఎక్కువ నెయ్యి వేసి చేసిన ఉప్మా పెడుతూ అంది, "ఒక మంచి కబురు! ఏమిటో చెప్పుకోండి!" అంటూ క్విజ్జింగ్ చేసింది!

మంచి కబుర్లు వినడం నా జాతకంలో లేదు. ఏమిటి ఆ శుభవార్త అని ఆశ్చర్యపోయేను. "ఏవిటా కబురు?"

"చెప్తే నాకేమిస్తారు?"

"అది ఆ కబురు మీద ఆధారపడి వుంటుంది."

"కంచి పట్టుచీర కొనవలసినంత మంచి కబురు. కొంటారా?"

"ఆ మంచి కబురు వల్ల అంత లాభం కలిగితే తప్పకుండా కొంటాను!"

'మీ కెప్పుడూ లాభనష్టాలే! అలికి కోక కొనడం ఊరికుపకారమనే రకం మీరు!"

ఈవిడతో జగడమెందుకని, "సరే కొంటాను. చెప్పు!" అన్నాను.

అబ్బా! తెగ సిగ్గుపడిపోయింది.

అవే ముసి ముసి నవ్వులు! సినిమాల్లో తన అభిమాన నటి ఆ కబురు చెప్పేటప్పటి పోజు పెట్టి, అటువంటి పదజాలం వాడుతూ, ఆ నటి గొంతు ననుకరిస్తూ చెప్పింది: "మనకొక చిన్నారి, ముద్దుల బాబు పుట్టబోతున్నాడు!"

నా మెదడులో బాంబు పేలింది. అదిరి పడ్డాను. "ముద్దుల బాబా? మనకు పుడతాడా? అమ్మబాబోయ్!" అంటూ కెవ్వున కేక పెట్టేను.

శ్రీమతి కంగారు పడింది. "ఏమయిందండీ? అలా అదిరి పడ్డారేమిటి?"

"నాకు చిన బాబూ వద్దు! పెద బాబూ వద్దు! వాడి తాత బాబూ వద్దు! వద్దు బాబోయ్!" అంటూ కేక పెట్టేను.

"మీకు మతి కాని పోయిందా?"

"కూతుర్ని కంటే కను! లేకపోతే వెంటనే డాక్టర్ దగ్గరికి పద! కడుపు తీయించేస్తాను!"

"మీకు పిచ్చెక్కింది. మన కప్పుడే అమ్మాయుంది కదండీ?"

"వుంటే వుండనీ! అలా కూతుళ్ళనే కంటూ వుందాం! కొడుకులు మాత్రం వద్దు"

"ఏం మాటలండీ అవి? 'అపుత్రస్య గతిర్నాస్తి' అని వేదాలు ఘోషిస్తున్నాయి కదండీ?"

"ఘోషిస్తే ఘోషించనీ!"

"మనం చస్తే తద్దినాలు పెట్టడానికి ఒక కొడుకు లేకపోతే ఎలాగండీ?"

"తద్దినాలు లేకపోతే గడవకపోదు. స్వర్గంలోనో, నరకంలోనో ఉపవాసాలుందాం"

"అయ్యో! ఈ ముష్టి ఆఫీసులో చేరేక మీకు వున్న మతి కూడా పోతోంది! ఒక బుజ్జి బాబు నాకు పుడితే వాడిని ఎంచక్కా పెంచుకుంటానో! ఉళు... ఉళూ... ఆయీ ఆయీ ఆపదలు కాయీ! గుర్రాలు కాచేటి గురవన్న తోడూ!" అంటూ పాట ఎత్తుకుంది.

"ఏమిటే అప్పుడే జోల పాట మొదలెట్టావ్?"

"ప్రాక్టీస్ చేస్తున్నాను. మధ్యని మరీ నాలుగేళ్ళు పెట్టేసేరా, పాడడం ప్రాక్టీసు పోయింది. సరైన రాగంతో పాడకపోతే బాబు పడుకోడు!"

ఆమె కడుపులోని జీవి అలా తొమ్మిది నెలలె దిగి, పుట్టి, పెరిగి పెద్దవాడై, ఆ మాలీ కొడుకు లాగ, రమణయ్య లాగ, వెంకట్రావ్ కొడుకు లాగ, హిరణ్య కశిపుడి కొడుకు లాగ తయారయి తండ్రి కెదురు తిరిగినట్టు నాకు కలొచ్చింది ఆ రాత్రి. గద పట్టుకొని ఒక యువకుడు నా మీదికి యుద్ధానికి వస్తున్నాడు.

"ఏంరా నాన్నా? నా తల్లిని అవమానించేవే! నా తల్లిని నానా మాటలూ అన్నావ్! నా తల్లికి నువ్వు ప్రామిస్ చేసిన కంచి పట్టు చీర కొనలేదు. గజ్జల వడ్డాణం చేయించలేదు. నాకు జీన్స్ కొనలేదు. సినిమాలకి అడిగినప్పుడల్లా డబ్బు లివ్వలేదు. నాకు గర్ల్ ఫ్రెండ్స్‌ని కుదిర్చిపెట్టలేదు. నేను కుదుర్చు కుంటే, దాని అబ్బ నీకు రిపోర్టిచ్చేడని నా మీద కలియపడ్డావ్. అమ్మ పెట్టా పెట్టదు, అడుక్కు తినా నివ్వదన్నట్టుంది నీ వ్యవహారం!" అంటూ నానా మాటలూ అన్నాడు.

"నేను నీ తండ్రిని రా! పితృదేవో భవా అన్నారు. నేను నీకు జీవం ఇచ్చిన వాడిని. గురువు వంటి వాడిని. దేవుడు వంటి వాడిని. నువ్వు నన్నటు వంటి మాటలనడం, దేవుడితో సమానుడినయిన నాతో కయ్యానికి కాలు దువ్వడం తగదు! ఆ పాపానికి పరిహారం లేదు. కాశీలో ఆవుని చంపి నంత పాపం!" అంటూ నీతి శాస్త్రం వర్ణించేను.

"చాల్లే నీ చచ్చు కబుర్లు! నాకివన్నీ చెప్పకు. వేసేవు వేపకొమ్మని! తీసేవు అసిరిగాడిని! నన్నిప్పుడు వదిలించుకోలేవు!"

"అదేమిటా మాటలు?"

"నిన్నెవడు కనమన్నాడు నన్ను? నీ కామ సుఖం కోసం పోయి, ప్రమాదవశాత్తూ నన్ను కన్నావ్! పసివాడిగా నేనున్నప్పుడు నన్ను పెంచడం లోని ఆనందం అంతా అనుభవించేవు. ఇప్పుడు నన్నెక్కడికో పోయి, నా బాధలు నన్ను పడమంటే ఒప్పుకుంటానా? ఈ ప్రపంచంలో ఇన్ని బాధలున్నా యని తెలిస్తే ఆ స్వర్గంలోంచి ఈ నరకంలోకి రాకపోదును!"

"జీవితం దేవుడిచ్చిన వరం!"

"ఏ ఆనందమన్నా అనుభవించేది నేనిప్పుడే. చదువు పూర్తయ్యేక సర్టిఫికెట్టు ముష్టి చిప్పల్లా పట్టుకుని నేను ఊరూరా ఉద్యోగం కోసం తిరిగినప్పుడు, కర్మకాలి ఉద్యోగం దొరికి పెళ్ళి చేసుకున్నాక, కన్న పిల్లల్ని పోషించకలేక నరక యాతన అనుభవిస్తున్నప్పుడు నువ్వేమన్నా నా బాధలు పంచుకుంటావా?

"అలా భయపడిపోతే ఎలాగ నాయనా? నా నైతిక మద్దతు నీకెప్పుడూ వుంటుంది!"

"నైతిక మద్దతు! ఎవరిక్కావాలి? అప్పటికి నా మామ నీ కిచ్చిన కట్నం డబ్బులు ఖర్చు పెట్టేసి, రిటైరయి, నా పీకెక్కి కూచుంటావు. ముందుగానే దండోరా వేసుంటావు. రిటైరయి నా కొడుకూ, కోడలూ దగ్గరికి పోయి హాయిగా కాలు మీద కాలు వేసుకొని రామా, కృష్ణా అని అక్కడ పడుం టానూ అని ప్రగల్భాలు అందరి దగ్గరా పలికి వచ్చి, నా పీకెక్కి కూచుంటావు! నువ్వు చచ్చేదాకా మా ప్రాణాలు కాల్చుక తింటావు. నా పెళ్లాం చేత అడవా చాకిరీ చేయించుకుంటావు. నీ ముసలి సరదాలకి, అదే- కాశీ, రామేశ్వరం, భజనలూ, భక్తీ, ముక్తీ అంటూ డబ్బులు ఖర్చు చేయిస్తావు



చిత్రం: గోపీకృష్ణ

ఇవ్వనంటే ఏడుస్తావు. ఊరూ వాడా దండోరా వేస్తావు!"

"తప్పు నాయనా! ఇటువంటి మాటలనకూడదు!"

"చీకూ, చింతా లేక, బాదర బందీ లేని నీ లాంజివిటీని తెగ పెంచుకుంటూ కూర్చుం టావు. నేను రిటైరయినాక కూడా చావవు. పదిసార్లు మంచం మీంచి దించి, చావకపోతే మళ్ళా ఎక్కించి, ఆఖరికి నీకు మందు లిప్పిం చకుండా, తిండి పెట్టకుండా, నిన్ను కోమాలో పెడితే ఆఖరికి ఎలాగో తొంభయ్యేళ్ళు వచ్చాక గాని గుటుక్కుమనవు! తరువాత తద్దినాలు. అందుకే కదా నన్ను కన్నావు? నీ అంత స్వార్థపరుడూ, దగుల్బాజీ మరొకడుండడు ఈ భూప్రపంచంలో"

"ఒరే! ఒరే! మాటలు మితిమీరుతున్నావు!"

"బెదిరిస్తున్నావా? ఈ గదతో ఒక్క పెట్టు పెట్ట గలను జాగ్రత్త! నేనెక్కడ పుట్టకుండా పోతానోనని వెయ్యి దేవుళ్లకి మొక్కేవే!"

"ఆ పని నీ తల్లి చేసింది."

"ఎవరు చేసినా ఒక్కటే! నువ్వామెతో కోపరేట్ చెయ్యకపోతే నేను పుట్టుందునా? దేవుళ్ళకి కొబ్బరి కాయలుకొట్టి, సత్యనారాయణ వ్రతాలు చేసి మరీ కనిపించేవు నన్ను మా అమ్మ చేత! నీ పప్పులు నా దగ్గరుడకవు! నీ స్వార్థం, నీ దోపిడీ విధానం, నీ నిరంకుశత్వం ఇంకానా, ఇకపై సాగవు! నా హక్కుల కోసం నేనే గదా దండంతో పోరాడ తాను!"

"ఏమిటి నీ హక్కులు?"

"నేనడిగినవన్నీ నువ్వు తెచ్చి పెట్టాల్సిందే! నేను కోరిన బట్టలు కుట్టించాల్సిందే! నా ప్రియురా ళ్ళతో నన్ను తిరగనివ్వాల్సిందే! మా తిరుగుళ్ళకి నువ్వు పాకెట్ మన పుట్టమీద పెట్టినట్టు ఇవ్వవ ల్సిందే! ఒకవేళ నేను ఒక దాన్ని పెళ్లాడితే, నువ్వు మా ఇద్దర్నీ, మా పుట్టబోయే పిల్లల్నీ, నా చదువు పూర్తయి నాకు జాబ్ దొరికే వరకూ పోషించ వలసిందే! నాకు జాబ్ దొరికాక, నేను వేరు పోతానంటే నోరెత్తకుండా పడుండవలసిందే! నీకు నెల నెలా నేనేదిస్తే అది పుచ్చుకోవల్సిందే. నువ్వు రిటైరయ్యేక పార్ట్ టైమ్ జాబు చేసుకోవల్సిందే. నువ్వు చచ్చేవరకూ నీ పొట్ట నువ్వు పోషించుకో వల్సిందే! నా పీకల మీదికెక్కి, నా పెళ్ళాం చేత చాకిరీ చేయించుకుంటావంటే ఈ గదితో నీ తల మీద ఒక్క పెట్టు పెడతాను!"

"పెట్టరా! పెట్టు పెట్టు! ఆ పెట్టేదేదో ఇప్పుడే పెట్టి నా తల వెయ్యి చెక్కలు చెయ్యి! చెయ్యిరా!" అంటూ కేక పెట్టాను.

నా భార్య నన్ను తట్టి లేపింది. "ఏమిటండీ నిద్రలో ఆ గావుకేకలు? ఏమన్నా పీడ కలొచ్చిందేమిటి?"

"ఆ! ఎవడో గుంట వెధవ గద పట్టుకొని నా కొడుకునని చెప్తూ నా మీదకి యుద్ధానికి వచ్చేడే!"

"మీ కొడుకు మీ మీదకి యుద్ధానికి రావడమేమిటండీ? మీ చాదస్తం కాని? నా బాబెప్పుడూ అటువంటి వాడు కాదు! నా బాబు బంగారు కొండ!"

ఏడాది కాలం గడిచింది.

ఉయ్యాలలో బాబుని పడుకోబెట్టి ఆరునెలలయింది.

వాడి కోసం కొత్త ఉయ్యాల కొన్నాం.

మా ఆవిడ ప్రేమగా బాబుని అందులో పడు కోపెట్టి ఊచుతోంది. ఇన్నాళ్లయీ ప్రాక్టీసు చేసిన పాటలను పాడుతోంది. రామా లాలీ, మేఘ శ్యామా లాలీ, ఒంటిగా నుయ్యాల లూగితివా నా చిన్ని కృష్ణా, జంటగా నన్ను పిలువ తగదోయి, మొదలైన పాటలు పాడేస్తోంది!

"అందరూ బాబుని దిష్టి పెట్టేస్తున్నారండీ! పనస పండులా వున్నాడంటే, బత్తాయి పండులా వున్నాడూ అని. ఇవాళే దిష్టి తాడు కట్టేను. చూడండి ఎలా చిరునవ్వులు చిందిస్తున్నాడో నా బుల్లి బాబు! ఆ నవ్వుకి కోటి దీపాలు వెలుగుతాయి కదండీ?"

ఉయ్యాలలోని నా ముద్దుల కొడుకు కళ్ళలోకి చూశాను.

ఉలిక్కిపడ్డాను! ఎందుకుట? వాడు నన్ను చూసి కన్ను గీటేడు!

నా శ్రీమతి గారాలు పోతోంది.

"బంగారు తండ్రే! చిలిపి చిలిపి తండ్రిలే! నాన్నారిని తంతావేమిటమ్మా? నాన్నారి మీద కోపం చూపిస్తావేమిటి చిట్టి తండ్రులు?; అంత కోపం చూపిత్తే నే చచ్చిపోనూ? నా ముద్దుల మూటే! నా బాచాల కొండే!" కొడుకుని ముద్దులాడే కార్యక్రమంలో పై ప్రపంచాన్ని మర చిపోయింది. తల్లీకొడుకు లొక్కటయ్యేరు- ఇంక నా పని గోవిందా!